10న గౌడ సంఘం వనభోజన మహోత్సవం

అల్విన్‌కాలనీ: గౌడ సంఘీయుల కార్తీక వనభోజన మహోత్సవం 10వ తేదీ ఆదివారం ఉదయం 10గంటలకు వివేకానందనగర్‌లోని చిత్తారమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు కూకట్‌పల్లి కౌండిన్య సేవా సమితి నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘ సోదర, సోదరీమణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నామన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం



కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని ఎస్‌కేఎస్‌ఆర్ గార్డెన్స్‌లో జరిగిన శైలజా, నర్సింగ్‌రావుల కుమార్తె అలేఖ్య, సంజయ్ కృష్ణరావుల వివాహం గురువారం జరిగింది. ఈ వేడుకకు రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

10వ తేదీన వైద్యులకు న్యూట్రిషన్‌పై శిక్షణ

పంజగుట్ట: ఇటీవలి కాలంలో ప్రతి ఒక్కరికీ డయాబిటిస్, బీపీ, కొలెస్ట్రాల్ లాంటి ఆరోగ్య సమస్యలు ఉంటున్నాయని వీటన్నింటికీ కారణం సరైన న్యూట్రిషన్ ఫుడ్ లేకపోవడమే అని ఫిజీషియన్ అసోసియేషన్ ఆఫ్ న్యూట్రిషన్ నిర్వాహకులు డాక్టర్ రాజేందర్ అన్నారు. తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన బంజారాహిల్స్‌లోని హోటల్ రాడిసన్‌బ్లూలో వైద్యులకు, మెడికల్ ప్రొఫెషనర్లకు న్యూట్రిషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీనియర్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ అమృతతో కలిసి ఆయన మాట్లాడుతూ... ముందుగా వైద్యులకు న్యూట్రిషన్‌పై శిక్షణ ఇస్తే వారు వారివద్దకు వచ్చే రోగులకు సరైన భోజనం తీసుకోవాలని సలహాలు ఇస్తారన్న ఆలోచనతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కరోనా తరువాత ఆరోగ్యంపై ప్రతిఒక్కరికీ అవగాహన పెరగడం ఆనందమని, కానీ ఎలాంటి శిక్షణ లేనివారు కూడా ఇదితింటే మంచిది, అదితింటే మంచిదని చిట్కాలు ఇస్తున్నారని ఇది బాధాకరమైన విషయం అన్నారు.

అండగా నిలిచిన కార్యకర్తలకు ధన్యవాదాలు

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీకి అభినందనలు తెలిపిన నాయకులు

అల్విన్‌కాలనీ: ఇటీవల జరిగిన ఎన్నికల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి హ్యాట్రిక్ విజయాన్ని సాధించిన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి గురువారం కాలనీ అసోసియేషన్ సభ్యులు, పలువురు నాయకులు, కార్యకర్తలు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. తన మీద విశ్వాసం ఉంచి మూడోసారి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించిన శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. శేరిలింగంపల్లి ప్రజలకు ఎల్లవేళలా ఋణపడి ఉంటానన్నారు. తన వెన్నంటే ఉండి నడిపించిన కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్ నాయకులు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. మరింత బాధ్యతగా శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని తెలిపారు.

9న 'ఫెర్టీ 9 బేబీ మీట్'

పంజగుట్ట: సంతాన సాఫల్య చికిత్స ద్వారా పిల్లలు కన్న తల్లిదండ్రులు, పిల్లలతో ఈ నెల 9వ తేదీన బేగంపేటలోని హోటల్ గ్రాండ్ కాకతీయాలో 'ఫెర్టీ 9 బేబీ మీట్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఫెర్టీ 9 మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సి.జ్యోతి తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ లోగోను డాక్టర్ శోత్రియ, డాక్టర్ మౌనిక, డాక్టర్ ఇంద్రజిత్‌తో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీనటి స్నేహ హాజరవుతారన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఉచిత కన్సల్టెన్సీ, ఉచిత అల్ట్రాసౌండ్ స్కాన్, ఏఎంహెచ్ టెస్ట్, అండాశయ నిల్వ కీలక సూచిక, సంతానోత్పత్తి సామర్థ్యాన్ని అంచనా వేసే పరీక్షలు, పురుషుల వంధ్యత్వ పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే తిరుపతి, రాజమండ్రి, బంజారాహిల్స్, కర్నూలులో కొత్త సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

శబరిమలకు యువనేత రామకృష్ణగౌడ్



రామకృష్ణగౌడ్ ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

భాగ్యనగర్‌కాలనీ: యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్ శబరిమల యాత్రకు బయల్దేరుతున్న సందర్భంగా శంషీగూడలోని అయ్యప్పస్వామి దేవాలయంలో ఇరుముడి పూజా కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు. కాశీనాథ్ యాదవ్, ప్రదీప్‌రెడ్డి, ధాతి రమేష్, పృథ్వీ స్వాములు కూడా ఇరుముడితో శబరిమలకు బయల్దేరారు.

సీఆర్ ఫౌండేషన్‌లో నైపుణ్య శిక్షణా కేంద్రం

హఫీజ్‌పేట్: కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ నీలం రాజశేఖరరెడ్డి రీసెర్చ్ సెంటర్‌లో ఉచితంగా మహిళలకు కంప్యూటర్ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. స్వయం ఉపాధి కోసం టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం, డైయింగ్, ప్రింటింగ్, బ్యూటీషియన్, స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్‌కు సంబంధించిన పరిజ్ఞానం, ట్యాలీ, డీటీపీ తదితర శిక్షణలు ఉచితంగా అందిస్తున్నారు. మొదట అడిష్మన్ కొరకు రూ.150లు చెల్లించాలి. సంవత్సరానికి నాలుగు బ్యాచ్‌లుగా, ఒకోక్క బ్యాచ్‌కు మూడు నెలల పాటు శిక్షణ ఉంటుంది. ఒక బ్యాచ్‌లో సుమారు 100 మంది మహిళలు ఉంటారు. 15 సంవత్సరాల వయస్సు నుంచి 35 సంవత్సరాల మధ్యలో గల చిన్నారులు, మహిళలు ఈ శిక్షణలో పాల్గొనవచ్చు.

మరిన్ని వివరాలకు కన్వీనర్ వనశ్రీ ఫోన్ : 9246530048కు సంప్రదించగలరు. ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్

సీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు. కుటుంబ సమస్యలు ఉంటే ప్రత్యేకంగా ఫ్యామిలీ కౌన్సిలింగ్ కూడా తీసుకోవచ్చు. కన్వీనర్ వనశ్రీ నేతృత్వంలో కౌన్సిలింగ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు.

100 ఏళ్లు దాటిన సామాన్యుడి సంత!



- శతాబ్దానికి పైగా చరిత్ర కలిగిన ఎర్రగడ్డ మార్కెట్
- కాలనీల్లోకి చొచ్చుకురావడంతో ఇక్కట్లు

సనత్‌నగర్: సామాన్యుడికి ఆ సంతతో సంతోషం.. మధ్య తరగతిని మరిపించే ఓపెన్ మాల్.. ఇక శ్రీమంతులకు అదో ఆటవిడుపు. ఆదివారం సూర్యోదయం కాకమునుపే 'గిట్టుబాటు' అంకెలను గుక్క తిప్పుకోకుండా పలకడంలో అక్కడ వ్యాపారులు పోటీ పడుతుంటారు. ఆ రోజు అందరికీ సెలవు. కానీ వారికి ఈ సెలవు రోజే బతుకుదారం. పొద్దస్తమానం వారు పెట్టే 'రేటు' కేకలే వ్యాపారానికి మలుపులు. ఇదీ ఎరగడ్డ ఆదివారం అంగడి పరిస్థితి. శతాబ్దం కాలం క్రితం 15–20 దుకాణాలతో మొదలైన సంత నేడు దాదాపు వెయ్యి మంది చిరువ్యాపారులకు బతుకుకేంద్రంగా మారింది. రోడ్డే ఈ సంతకు అడ్డ. నాడు ఎర్రగడ్డ చౌరస్తాకే పరిమితమైన వ్యాపారాలు నేడు కిలోమీటరు పొడవునా విస్తరించాయి. చౌరస్తా నుంచి మొదలుకొని సనత్‌నగర్ బస్టాండ్ వరకు విస్తరించాయి.

సకల వస్తువుల కేంద్రంగా..

చిన్నా పెద్దా మాల్ అని తేడా లేదు. వాటిల్లో ఉండే ప్రతి వస్తువూ ఇక్కడ లభ్యమవుతోంది. స్క్రూడ్రైవర్ నుంచి షూష్, రెడీమేడ్ దుస్తుల నుంచి రేబాన్ గ్లాసెస్ వరకు, వంటింటి పాత్రల నుంచి వయ్యారాలు ఒలకబోసే అందమైన ఆటబొమ్మలు, ఆనాటి గ్రామఫోన్ల నుంచి నేటి స్మార్ట్‌ఫోన్లు, పెంపుడు పిల్లుల నుంచి మేకలు, గొర్రెల వరకు ఇలా ప్రతిదీ ఈ సంతలో దొరుకుతోంది. ముఖ్యంగా ప్రతినిత్యం ఇంట్లో ఉపయోగించే వస్తువులకు ఈ మార్కెట్ కేరాఫ్‌గా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆదివారం ఎర్రగడ్డ–సనత్‌నగర్ మార్గం ఇసుకేస్తే రాలనంతా జనంతో నిండిపోతోంది.



ఫోన్ల విడిభాగాలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

'సెకండ్స్'కు పెట్టింది పేరు..

ఎర్రగడ్డ సంత అంటే వస్తువులు 'సెకండ్స్'లో అమ్ముడు పోతాయన్నది వ్యాపార వర్గాలతో పాటు వినియోగదారుల మాట. షర్టులు, ప్యాంట్లు, గొడుగులు, సీడీలు, ఎలక్ట్రికల్, ఐరన్ ఇలా ఎన్నో రకాల వస్తువులు సెకండ్‌హ్యాండ్స్‌లో లభిస్తున్నాయి. ఇక ప్రొక్లేన్ నుంచి మొబైల్ ఫోన్ వరకు ఎలాంటి యంత్రాలు, వస్తువులకు కావాల్సిన విడి భాగాలు (స్పేర్‌పార్ట్స్)కు ఈ సంతే చిరునామా. అందుకే ఎర్రగడ్డ సంతకు అంత క్రేజ్. తక్కువ ధరకే తమకు కావాల్సిన వస్తువు దొరుకుతుండడంతో వినియోగదారులు ఈ సంత బాట పడుతుంటారు. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, మియాపూర్, అమీర్‌పేటల నుంచే కాకుండా నగరం నలుమూలల నుంచి ఈ మార్కెట్‌ను సందర్శించి తమకు కావాల్సిన వస్తువులను కొనుగోలు చేసుకుంటారు. ప్రతివారం దాదాపుగా 30 నుంచి 40 వేల మంది వినియోగదారులు ఈ మార్కెట్‌ను సందర్శిస్తుంటారని అంచనా.



వందేళ్ల చరిత్రకు సాక్ష్యంగా..

రాజులు పోయారు..రాజ్యాలు పోయాయి...కానీ వందేళ్ల సాక్ష్యానికి ఇక్కడ మార్కెట్ సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. గత దశాబ్దన్నర క్రితం వరకు పశువుల సంత కూడా ఇక్కడే జరిగేది. వివిధ జిల్లాల నుంచి విభిన్న జాతుల ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలను తీసుకువచ్చి క్రయ విక్రయాలను జరుపుతుండేవారు. అయితే పెరిగిన ట్రాఫిక్ దష్ట్యా ఇక్కడి పశువులను సంతను మోతీనగర్ సమీపంలోని బబ్బుగూడకు తరలించారు. సాధారణ మార్కెట్ మాత్రం ఇక్కడే కొనసాగుతోంది.

సీజనల్ వ్యాపారాలకు..

చలికాలం మొదలైంటే ఇక్కడ స్వెట్టర్లను అమ్మకాలు భారీగా జరుగుతాయి. కల్లంలో ధాన్యపు రాశులు పోసినట్లుగా రోడ్డుపై స్వెట్టర్లతో పాటు విభిన్న రకాల మంకీ క్యాప్‌లు, చలికి చెక్‌పెట్టే ఉన్ని దుస్తుల విక్రయాలు కొనసాగిస్తుంటారు. ఇక వర్షాకాలం వచ్చిందంటే రెయిన్ కోట్లు, కళ్లు జిగేల్‌మనిపించే కలర్స్‌లో గొడుగులు ఈ మార్కెట్‌ను ముంచెత్తు తాయి. ఇక ఎండాకాలం వచ్చిందంటే కాటన్ దుస్తులు ఎక్కువగా దిగు మతి చేసుకుని అమ్మకాలు సాగిస్తారు.

స్థానికుల నుంచి వ్యతిరేకత..

సంత కారణంగా రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా ఉంటుందని పలు కాలనీవాసుల నుంచి చిరువ్యాపారులకు చుక్కెదురవుతోంది. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. ముఖ్యంగా రోడ్డును ఆనుకుని ఉన్న జెక్‌కాలనీ, ఎస్‌ఆర్‌టీకాలనీవాసులు సంతలోని చిరువ్యాపారులతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నామన్నది వారి వాదన. ముఖ్యంగా జెక్‌కాలనీ రోడ్ల పైకి వ్యాపారులు రావడంతో అంబులెన్స్ ఫైరింజన్‌వంటి అత్యవసర సేవలు అందించే వాహనాలు రావాలన్నా ఇబ్బందికరంగా ఉంటుందని కాలనీవాసులు వాపోతున్నారు. కాలనీ రోడ్ల పైకి రాకుండా అంగడి వ్యాపారాలు కొనసాగించుకోవాలని వారు పోరాడుతూ వస్తున్నారు. వ్యాపారాలకు నష్టం లేకుండా.. జెక్ కాలనీ రోడ్ల పైకి వ్యాపారాలు చొచ్చుకు రాకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని వారు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.15, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23 బెండకాయ 45, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 85, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 35, పందిరి బీర 40, క్యాబేజీ 11, క్యారెట్ 25, దొండ 35, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 45, గోకరకాయ 35, కీర 20, దోసకాయ 25, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 38, ఆలుగడ్డ 23, చామగడ్డ 40, మొరంగడ్డ 18, కందగడ్డ 45, సొరకాయ 11, పొట్లకాయ 15, అరటికాయ 9, మునగకాయ 4–6, ముల్లంగి 4–6. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

నేడు సైన్స్, ఇండస్ట్రీ సదస్సు

లాలాపేట: తార్నాకలోని ఐఐసీటీ ఆడిటోరియంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు సైన్స్, ఇండస్ట్రీ, సొసైటీ అనే అంశంపై ప్రత్యేక సదస్సు నిర్వహిస్తున్నట్లు సీసీఎంబి డైరెక్టర్ డాక్టర్ వినయ్‌కే నందికూరి గురువారం ఓ పత్రికా ప్రకటనలో తెలిపారు. ఐఎన్‌ఎస్‌ఏ 89వ వార్షిక జనరల్ బాడీ సమావేశాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ సదస్సులో ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ ప్రెసిడెంట్ అశుతోష్ శర్మ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సదస్సులో మరో 8 మంది సైంటిస్టులు పాల్గొంటారని పేర్కొన్నారు.

ప్రగతి భవన్‌కు జ్యోతిరావ్ పూలే నామకరణం పట్ల హర్షం

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రగతి భవన్‌కు మహాత్మాజ్యోతి రావ్ పూలే పేరు పెట్టడం పట్ల బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయానికి యావత్ బీసీల తరఫున ధన్యవాదలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. బీసీ సమస్యల పరిష్కారానికి మహాత్మా జ్యోతి బాపూలే ప్రజా భవన్ వేదిక కావాలని లింగంగౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

వృద్ధుడి అదృశ్యం



సుబ్బారావు (ఫైల్)

బాలానగర్: కోపంతో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాని సంఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాలానగర్‌లోని గౌతమ్‌నగర్‌లో నివాసముండే దాయరాజు సుబ్బారావు (70) కోపంతో ఇంటి నుంచి నవంబర్ 7వ తేదీ ఉదయం 8గంటలకు బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. గతంలో కూడా ఇదే విధంగా బయటకు వెళ్లి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల, బంధువులు ఇళ్లల్లో వాకబు చేసిన రాకపోవటంతో ఆందోళనకు గురై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్స్ కొత్త చైర్మన్‌గా సీఎం రేవంత్‌రెడ్డి

- మొదటి నుంచి సీఎం చైర్మన్‌గా వ్యవహరిస్తున్న వైనం
- శుభాకాంక్షలు తెలిపిన నిమ్స్ ఉద్యోగ సంఘాలు

లక్డీకాపూల్: నిజామ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) నూతన చైర్మన్‌గా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి వ్యవహరించనున్నారు. ఇక నుంచి నిమ్స్ గవర్నింగ్ కౌన్సిల్ అధ్యక్షుడిగా సీఎం రేవంత్ కొనసాగుతారు. బొక్కల దవాఖా నుంచి నిజాం వైద్య విజ్ఞాన సంస్థగా ఎదిగిన మొదలు నిమ్స్ చైర్మన్‌గా రాష్ట్ర ముఖ్యమంత్రి వ్యవహరిస్తూ వస్తున్నారు. అదే క్రమంలో గురువారం రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్ రెడ్డి నిమ్స్ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. సీఎంతో పాటు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా నిమ్స్ గవర్నింగ్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడిగా వ్యవహరించనున్నారు. ఈయన నిమ్స్ ఎగ్జిక్యూటివ్ బోర్డు సభ్యులుగా కొనసాగనున్నారు. ఇప్పటి వరకు గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్, మాజీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న తన్నీరు హరీష్‌రావులు గవర్నింగ్ కౌన్సిల్ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ క్రమంలో నిమ్స్ పారా మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ శిరందాస్, నిమ్స్ నాన్ ఫ్యాకల్టీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సత్యగౌడ్, సురేష్ బాబులు కొత్త సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. సీఎం రేవంత్ హయాంతో ఆస్పత్రి విస్తరణ అభివృద్ధి జరుగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

రేపు రుద్రహోమం

రాయదుర్గం: టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. తిరుమల తిరుపతి దేవస్థాన వార్షిక సత్కార పండితులు శైవాగమ ప్రతిష్టాచార్య కాళ్ళకూరి సూర్యశ్రీ చేతుల మీదుగా పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 6.30 గంటలకు గణపతిపూజ, రుత్విక్ వరుణ, దీక్షాధారణ, శైవాగంమ పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాసన, త్రిశూల పూజ, మహాన్యాస మంత్రపఠనం, అమృతేశ్వరుడికి 21 ద్రవ్యాలతో విశేష అభిషేకం నిర్వహిస్తారు. అనంతరం రుద్రహోమం, పూర్ణాహుతి, పండిత ఆశీర్వచనం, తీర్థ ప్రసాద వితరణ, మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

యువతి అదృశ్యం

వెంగళరావునగర్: డ్యూటీకి వెళ్లిన యువతి అదృశ్యమైన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... రహమత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్‌హిల్స్‌లోని ఓంనగర్‌కు చెందిన వి.శ్రావణి(20) అమీర్‌పేటలోని ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తుంది. గత నెల 15న ఆమె ఉదయం ఇంటి నుంచి డ్యూటీకి బయలుదేరి వెళ్లింది. సాయంత్రం ఇంటికి తిరిగి రాలేదు. ఫోన్ చేయడానికి ఆమె ఫోన్ లేకపోవడంతో సోదరుడు మహేష్ షాపునకు వెళ్లి విచారించాడు. అయితే ఆమె అక్కడకు రాలేదని నిర్వాహకులు తెలియజేశారు. దాంతో మహేష్ తన సోదరి కోసం బంధువులు, స్నేహితులు, అనేక ఊళ్లల్లో వెదికాడు. ప్రయోజనం లేనందున మహేష్ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌లో ఉచిత శిక్షణ



సుభాష్‌నగర్: మల్లారెడ్డి కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (ఎంఆర్‌సెట్), మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ భారత ప్రభుత్వ రంగ సంస్థ మధ్య గురువారం పరస్పర అవగాహన ఒప్పందం జరిగింది. ఎంఆర్‌సెట్ కళాశాల తరపున డైరెక్టర్ డాక్టర్ వీఎస్‌కే రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రావు, సీఎస్ఐ అకాడమీ వీఆర్వో రామ్మోహన్‌రావు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ ఒప్పందంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. అదే విధంగా విద్యార్థులు, అధ్యాపకులు ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డ్ ప్లాట్‌ఫామ్‌లో నైపుణ్యాలను పెంపొందించుకునే వీలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

గార్మీ ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు



జగద్గిరిగుట్ట: గార్మీ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని బీఆర్‌ఎస్ నాయకుడు జైహింద్ అన్నారు. గురువారం జగద్గిరిగుట్ట డివిజన్ భగత్ సింగ్‌మార్గ్‌లోని దర్గాలో శనివారం నిర్వహించనున్న గార్మీ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గార్మీ ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు రషీద్, హజ్రత్ అలీ, ముస్లిం పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు ఉన్నారు.

జలసౌధలో సంబరాలు

పంజగుట్ట: రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రిగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో ఎర్రమంజిల్‌లోని జలసౌధలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ సంబరాలు చేసుకొని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుని ఆనందం వ్యక్తం చేశారు. అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎల్.నాగరాజు మాట్లాడుతూ... త్వరలోనే మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపి తమ సంపూర్ణ మద్దతు ఇస్తామన్నారు. రెండేళ్లుగా ఆగిన పదోన్నతులు, మూడు సంవత్సరాలుగా చెల్లించని టీఏ బిల్లులు, నిలిచిపోయిన ఏహెచ్‌ఏఆర్, కొన్ని చోట్ల నిలిచిపోయిన హెచ్‌ఆర్‌ఏ, ఇతర సమస్యలను మంత్రికి వివరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి సంతోష్‌రెడ్డి, ముఖ్య సలహాదారు కుడుములు బుచ్చయ్య, గౌరవాధ్యక్షుడు వేదగిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతిభవన్ పేరు మార్చడం హర్షణీయం

పంజగుట్ట: ప్రగతిభవన్‌కు జ్యోతిబా పూలే ప్రజాభవన్‌గా పేరుమార్చడం హర్షణీయమని తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రశేఖర్ గౌడ్ అన్నారు. గత ప్రభుత్వం బీసీలు ఎదుర్కొంటున్న ఏ సమస్యనూ పరిష్కరించలేదని ఆయన ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చెయ్యగానే ప్రగతిభవన్‌ను జ్యోతిబా పూలే ప్రజాభవన్‌గా పేరుమార్చారని, ముందు బీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలు పరిష్కరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు రమ, వంశీధర్, చక్రధర్ పాల్గొన్నారు.

'దాడులు సరికావు'

పంజగుట్ట: మాదిగ జాతికి జవాబుదారీగా ఉండాల్సిన మాదిగ సంఘం నాయకుడు మేడి పాపయ్య, మరో మాదిగ ఉద్యమ నేత వంగపల్లి శ్రీనివాస్‌పై దాడి చెయ్యడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పలు మాదిగ సంఘాలు పేర్కొన్నాయి. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఇటుక రాజు మాదిగ, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా అధ్యక్షులు జంగు కనకరాజు మాదిగలు మాట్లాడుతూ... ఈ నెల 2వ తేదీన హబ్సిగూడలోని సుప్రభాత్ హోటల్‌లో మేడి పాపయ్య తోటి ఉద్యమ కారుడు వంగపల్లి శ్రీనివాస్‌పై దాడి చెయ్యడం బాధాకరమన్నారు. సమావేశంలో కాశీ సతీష్ మాదిగ, జానయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ ప్రాముఖ్యతను విస్మరించలేం

మనూ వీసీ ఐనుల్ హసన్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ఐనుల్ హసన్, ప్రొఫెసర్లు

రాయదుర్గం: డిజిటల్ విప్లవం యొక్క ప్రభావాలను, దాని ప్రాముఖ్యతను విస్మరించలేమని మనూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో గురువారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్, ఐఊఊఈ టాస్క్‌ఫోర్స్ ఇన్ గామిఫికేషన్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ అర్జెంటీనా, ఇంటర్నేషనల్ సోషియోలాజికల్ అసోసియేషన్, ఇండియన్ సోషియాలాజికల్ సొసైటీ సహకారంతో 'డిజిటలైజేషన్, న్యూమీడియా, వీడియో గేమ్ కల్చర్' అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ డిజిటలైజేషన్ సానుకూల, ప్రతికూల ప్రభావాలు దాని వినియోగంపై ఆధారపడి ఉంటాయన్నారు. స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ ఫరీదా సిద్దిఖీ మాట్లాడుతూ డిజిటల్ విప్లవంలో ఆర్థిక కోణాలు, పద్ధతులను పరిచయం చేయడేమ ఈ సదస్సు ఉద్దేశమన్నారు. అనంతరం ప్రొఫెసర్ ఫరీదా సిద్దిఖీ, డాక్టర్ తాహా సంకలనం చేసిన పుస్తకాన్ని వీసీ ప్రొఫెసర్ ఐనుల్ హసన్ విడుదల చేశారు.

ఘనంగా కేంద్రీయ విద్యాలయ వార్షిక క్రీడోత్సవాలు



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని కేంద్రీయ విద్యాలయ వార్షిక క్రీడోత్సవాలను గురువారం నిర్వహించారు. విశ్రాంత పీఈటీ వి సంజీవన్, విఎంసీ సభ్యురాలు లిజిబాబి ప్రారంభించారు. విజేతలకు బహుమతులను అందించారు. వారు మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులు క్రీడలలో రాణించేలా చూడాలన్నారు. జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికయిన వారిని వారు అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రియరాణి, పీఈటీ విజయభాస్కర్‌రెడ్డి ,వందన హరముక్ ప్రసంగించారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు, సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది. 'యాంగర్ ఫ్రీ లైఫ్ స్టైల్' అనే అంశంపై సీనియర్ రాజయోగ టీచర్ బి.కె.కవిత ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాల కోసం 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

స్కాలర్‌షిప్‌లను ప్రకటించిన 'ఐఎస్‌బీ'



గచ్చిబౌలిలోని ఐఎస్‌బీ ప్రధాన భవనం

రాయదుర్గం: ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ) సాయుధ దళాల స్కాలర్‌షిప్‌ను ప్రకటించింది. మాజీ సైనికుల సంక్షేమ శాఖ, రక్షణ మంత్రిత్వశాఖ ఇందుకు తన సహకారాన్ని అందిస్తుంది. సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల, భారత ప్రభుత్వ మాజీ సైనికుల సంక్షేమ శాఖ కార్యదర్శి విజయ్‌కుమార్‌సింగ్ కలిసి ప్రకటించారు. ఈ ప్రకటనతో ఐఎస్‌బీ సాయుధ దళాల అనుభవజ్ఞులకు లేదా పౌర జీవితంలోకి మారే సిబ్బందికి 50 శాతం ట్యూషన్ ఫీజు మినహాయింపును అందిస్తుంది. పోస్టు గ్రాడ్యుయేట్, అధునాతన మేనేజ్‌మెంట్ కోర్సుకు ఇది వర్తిస్తుంది. ప్రతి యేటా 22 మందికి ప్రయోజనం చేకూరుస్తుంది.